ఈనాడు జయశంకర్ భూపాలపల్లి

శనివారం అక్టోబరు 26, 2024

మంత్రి సురేఖ సైకిల్ సవారీ



రామన్నపేట, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విద్యార్థి దశ రోజులు గుర్తు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం వరంగల్ ఓసిటీలోని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆంధ్రా బాలిక ఉన్నత పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థినులకు మంత్రి సురేఖ చేతుల మీదుగా కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి కృష్ణగౌడ్ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి విద్యార్థినులతో కలిసి క్యాంపు కార్యాలయం వద్ద సైకిల్ తొక్కి సందడి చేశారు. విద్యార్థినులతో స్వీయ చిత్రాలు దిగారు.

మేడిగడ్డకు తగ్గిన వరద ప్రవాహం

మహదేవపూర్, న్యూస్‌టుడే : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయడంతో కాళేశ్వరం ప్రాజెక్టుకు వరద చేరుతోంది. మేడిగడ్డ బ్యారేజీకి 1,14,290 క్యూసెక్కుల మేర ప్రవాహం ఉండగా 98,440 క్యూసెక్కులకు వరద తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి మళ్లీ వరద పెరిగే అవకాశం ఉంది.

పశు గణనకు సమగ్ర సమాచారం అందించాలి



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పశువులు, ఇతర జంతువుల గణనకు సిబ్బందికి సమగ్ర సమాచారం అందించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పశుగణనకు సంబంధించిన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. 21వ అఖిల భారత పశు, జంతువుల గణన కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ పశువుల అభివృద్ధి కోసం పశుగణన చేపట్టారన్నారు. గణనలో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, బాతులు, కోళ్లు, వీధి కుక్కలు తదితరాలను లెక్కిస్తారన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన నిర్వహిస్తారని, ఈ కార్యక్రమంలో 56 మంది సిబ్బంది, 11 మంది సూపర్‌వైజర్లు, ఒక నోడల్ అధికారి పాల్గొంటారని తెలిపారు. ఎప్పటికప్పుడు పశుగణన వివరాలను యాప్‌లో నమోదు చేస్తారని, 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి, సహాయ సంచాలకులు గోపాలకృష్ణ మూర్తి, వెంకన్న, ప్రశాంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కుమురం భీం సేవలు చిరస్మరణీయం



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మధూకర్

మల్హర్, న్యూస్‌టుడే: గిరిజన హక్కుల పోరాట యోధుడు కుమురం భీం సేవలు చిరస్మరణీయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మల్హర్ మండలం కొయ్యూరులో శుక్రవారం ఆమె మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌తో కలిసి కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కుమురం భీం భూమి, భుక్తి కోసం నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. హక్కులను సాధించుకునేందుకు ఆదివాసీలందరూ ఏకం కావాలన్నారు. ఆయన కలను సాకారం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే మధూకర్ మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం వస్తేనే బాగుపడతామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. మహనీయులను అవమాన పరిస్తే సహించలేదన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ జక్కు శ్రీహర్షిణి, ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం నాయకులు రమేష్, గడ్డం లచ్చయ్య, బాపు, రామచంద్రం పాల్గొన్నారు.

స్వల్ప వాగ్వాదం

కుమురం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమంలో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. విగ్రహం ముసుగు తొలగించిన తర్వాత శిలా ఫలకాన్ని ఎమ్మెల్యే లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మధూకర్ ఆవిష్కరిస్తుండగా కాటారం సీఐ నాగార్జునరావు, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకాన్ని ఆవిష్కరించొద్దని సూచించగా కొంత వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో శిలాఫలకంపై కప్పిన కవర్‌ను ఎమ్మెల్యే తొలగించారు. తర్వాత సభ ప్రశాంతంగా ముగిసింది.

విద్యాలయాల్లో పారిశుద్ధ్యం జాడేది?

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలోని రెండు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలు, పుల్లూరిరామయ్యపల్లి, కాశీంపల్లి, జంగేడు, భూపాలపల్లిలోని నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు, వివిధ గ్రామాలు, కాలనీల్లో మరో 14 ప్రాథమిక పాఠశాలలున్నాయి. భూపాలపల్లి పట్టణం సమీపంలో పలు ప్రాథమిక పాఠశాలలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులుండగా, 80 వేలకు పైగా జనాభా ఉంది. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ప్రస్తుతం 90 మంది కార్మికులున్నారు. కార్మికుల కొరతతో పలు పాఠశాలల్లో అపరిశుభ్రత నెలకొంది. ఈ సిబ్బంది సరిపోవడం లేదని మరి కొందరు కార్మికులను నియమించాలని పాలక సభ్యులు కోరుతున్నారు.

జిల్లాలో వివరాలు..	
పంచాయతీలు	241
ప్రాథమిక పాఠశాలలు	315
ప్రాథమికోన్నత..	44
ఉన్నత..	69
మొత్తం విద్యార్థులు	20,443



భూపాలపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో అపరిశుభ్రత

రూ.లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని ఒక వైపు ప్రభుత్వం చెబుతోంది. ఈ క్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి కమిటీల పేరుతో పేరుతో ప్రభుత్వం లక్షలాది రూపాయలను వెచ్చిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పలు పాఠశాలల్లో మౌలిక వసతులు కరవయ్యాయి. మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. సర్కారు బడుల్లో పారిశుద్ధ్య పనుల బాధ్యతలను ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అప్పగించింది. మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించింది. దీన్ని పంచాయతీ కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో అనేక పనులతో సతమతమవుతున్నారని, కార్మికుల కొరత కారణంగా పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం సాధ్యం కాదని కొందరు మాజీ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

దినసరి కూలీలతో..

జిల్లాలో 428 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. కొన్ని పాఠశాలల్లో 150 నుంచి 360 మంది వరకు విద్యార్థులుంటారు. ఏడేళ్ల క్రితం ఆర్ఎంఎస్ఏ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు పారిశుద్ధ్య కార్మికులను నియమించి, వారికి నెలకు రూ.2,500 చొప్పున వేతనాలు చెల్లించారు. వీరందరినీ 2019-20 విద్యాసంవత్సరం తర్వాత తొలగించారు. అనంతరం పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను మున్సిపాలిటీల్లో కార్మికులకు, పంచాయతీలకు అప్పగించారు. కార్మికుల కొరత కారణంగా సర్పంచులు పంచాయతీ కార్మికులను పంపించడం లేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే వంతుల వారీగా కార్యాలయ గదిని, స్టాఫ్ రూంను శుభ్రం చేసుకుంటున్నారు. కొందరు ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులతో దినసరి కూలీలను నియమించి పనులు చేయిస్తున్నారు.

త్వరలో హెచ్ఎంల ఖాతాల్లో నిధులు జమవుతాయి

-రాజేందర్, డీఈవో

పారిశుద్ధ్య నిధులు త్వరలో ఆయా పాఠశాలల హెచ్ఎంల ఖాతాల్లో జమ అవుతాయి. ఇప్పటికే ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇప్పటి వరకు గ్రామాల్లో పంచాయతీ కార్మికులు, పట్టణంలో మున్సిపాలిటీ కార్మికులు పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. కొన్ని పాఠశాలలకు కార్మికులు రావటం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ నెల నుంచి డిసెంబరు వరకు పారిశుద్ధ్య నిధులు విడుదలయ్యాయి.


కల్వర్టుపై గుంత.. ప్రయాణానికి చింత



చిట్యాల నుంచి టేకుమట్లకు వెళ్లే మార్గంలో కల్వర్టులపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఈ దారిలో 11 కి.మి.మేర ఉన్న రహదారిపై నాలుగు కల్వర్టులు ఉండగా రెండు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరో రెండు కొంత మేర శిథిలమయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు కల్వర్టులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, చిట్యాల


చూపరులకు ఆహ్లాదం.. రైతులకు ఆదాయం



గణపురం మండలం బుర్రకాయలగూడెంలో రైతులు బంతిపూలను సాగు చేస్తున్నారు. నారింజ, పసుపు రంగుల్లో ఉన్న బంతి పూలు రహదారిపై వెళ్లే వారిని ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల బతుకమ్మ వేడుకల సందర్భంగా బంతిపూలకు గిరాకీ పెరిగి రైతులకు మంచి ఆదాయం వచ్చింది. దీపావళి పండగ సమీపిస్తుండడంతో పూలకు మంచి ధర వచ్చే అవకాశముందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, గణపురం

దూది రైతుకు దుఃఖమే మిగిలింది!

ఈనాడు, వరంగల్, మహబూబాబాద్
ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



'శుక్రవారం మార్కెట్‌లో వ్యాపారులంతా సిండికేట్ కావడంతో ధర పడిపోయింది. మద్దతు ధర రూ.7521 ఉండగా తేమ పేరుతో వ్యాపారులు రూ.1000 నుంచి రూ.1500 తగ్గించి కొనుగోలు చేశారు.'

రైతు ఆశాజీవి.. ఎప్పటికైనా గిట్టుబాటు ధర రాకపోతుందా అని ఆరుగాలం కష్టించి పంట పండిస్తే చివరికి కన్నీరే మిగులుతోంది. ఈసారి అకాల వర్షాలు, చీడపీడల కారణంగా.. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దానికితోడు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. మార్కెట్‌లో దళారులు, అధికారులు కుమ్మక్కై ధర తగ్గించి రైతును నిలువునా ముంచుతున్నారు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పత్తిని అధికంగా పండించే అన్నదాతల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది.

● రాష్ట్రంలోనే పెద్దదైన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పత్తిని అమ్మకానికి తీసుకొస్తారు. శుక్రవారం ధర పడిపోవడంతో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. పోలీసులు రంగప్రవేశం చేసి రైతులు, రైతు సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, మార్కెట్ అధికారులతో చర్చించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కార్యదర్శి రైతు సంఘాల నాయకులకు భరోసానివ్వడంతో.. ఆందోళన సద్దుమణిగింది. ఎలాంటి షరతులు లేకుండా సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని, మద్దతు ధర రూ.11 వేలకు పెంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సీసీఐ ప్రేక్షక పాత్ర..

వ్యాపారుల చేతుల్లో రైతులు నిలువునా మోసపోతున్నా.. భారత పత్తి సంస్థ ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తిలో 8 నుంచి 12 తేమ శాతం రాదని తెలిసినా.. తేమశాతాన్ని పెంచేందుకు సీసీఐ నిబంధనలు ఒప్పుకోవని అధికారులు చేతులెత్తేశారు. దాంతో వ్యాపారులు రైతుల కష్టాన్ని అగ్గువకే దోచుకుంటున్నారు. మరోవైపు గ్రామాల్లోనూ దళారులు అక్రమంగా పత్తి కొనుగోళ్లు చేస్తూ.. తిరిగి మార్కెట్‌లో అదే పత్తిని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న మార్కెట్ సిబ్బంది

మార్కెట్‌లో 'మద్దతు' కరవు

రూ.10 వేలకు అమ్మినా ఏమీ మిగలవు

- అడ్డాల కిషన్‌రావు, రైతు, రేవల్లె, దుగ్గొండి



నాకున్న రెండెకరాల్లో పత్తి వేశాను. శుక్రవారం 8 క్వింటాళ్ల వరకు పత్తి తీసుకువస్తే క్వింటాకు రూ.6600 చెల్లించారు. ఎకరా పత్తి తీయిస్తేనే రూ.4 వేల వరకు ఖర్చయింది. నాలుగుసార్లు పురుగుమందులు, ఇతరత్రా ఖర్చులు కలిపి చాలా ఖర్చయింది. క్వింటా పత్తి రూ.10 వేలకు అమ్మినా మాకు ఏమీ మిగలవు.

రవాణాకే రూ.5 వేలు చెల్లించాను

- రౌతు రాజయ్య, రైతు, కుంటపల్లి, సంగెం



మూడెకరాల్లో పత్తి వేస్తే తొలి కాపులో 15 క్వింటాళ్ల వరకు వచ్చింది. మార్కెట్‌కు తేవడానికి రూ.5 వేలు ఖర్చయింది. కూలీలు రూ.500 ఇస్తేగానీ రావడం లేదు. ఇక్కడ రూ.6500 కంటే తక్కువకే అడుగుతున్నారు. గతేడాది రూ.7 వేలకు పైగా ధర వచ్చింది.

రైతుల ఇబ్బందులపై వివరణ కోరగా
● పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సీసీఐ కనీస తేమ 15 నుంచి 20 శాతానికి పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశామని అన్నారు.
● ఎనుమాముల మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల మాట్లాడుతూ వ్యాపారులు తక్కువ ధరకు రైతుల నుంచి సరకును కొనకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పంటను దున్నేస్తున్నారు...!

గత ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాల ప్రభావం పత్తి రైతులను వెంటాడుతోంది. భారీ వర్షాల సమయంలో పత్తి పూత, పిందె రాలిపోయి తెగుళ్ల బారిన పడింది. చివరి ప్రయత్నంగా పురుగు మందులను పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది.



● నర్సింహులపేట మండలం జగ్గుతండా గ్రామశివారు చింతలతండాకు చెందిన రైతు బానోతు బాలాజీ మూడున్నర ఎకరాల్లో పత్తి వేశారు. రూ.లక్ష వరకు పెట్టుబడి వ్యయం చేయగా భారీ వర్షాలతో పూత, పిందెలు రాలిపోయాయి. ఎరువుల దుకాణదారుల సూచన మేరకు పలు రకాల పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం కానరాలేదు. పది క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వచ్చింది. పంటకు గులాబీ పురుగు ఆశించడంతో శుక్రవారం ట్రాక్టర్‌తో దున్నించి తొలగించారు.



● గోపాతండాకు చెందిన తాజా మాజీ సర్పంచి అజ్మీర లక్ష్మి రూ.60 వేలు వెచ్చించి రెండెకరాల్లో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలకు పంట పూత, పిందెలు రాలిపోయి పెరుగుదల నిలిచిపోయింది. పురుగు మందులు వాడినా ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. తెగుళ్లు, వానరాల నుంచి కాపాడుకోలేక పంటను పశువులకు మేతకు వదిలేశారు..

–న్యూస్‌టుడే, నర్సింహులపేట

జిల్లాల వారీగా..	వరంగల్	జనగామ	భూపాలపల్లి	మహబూబాబాద్	హనుమకొండ	ములుగు
● ఎకరాలు	1,19,910	1,16,000	93,460	79,632	77,330	20,740
● పత్తి దిగుబడి అంచనా (ఎకరానికి 6 క్వింటాళ్ల చొప్పున)	7,19,460	6,96,000	5,60,760	4,77,792	4,63,980	1,24,441

ఉత్సాహంగా 'ఎస్‌జీఎఫ్ఐ' ఎంపిక పోటీలు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అండర్-19 క్రీడా ఎంపిక పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నాలుగు రోజులపాటు జరిగే క్రీడా పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జూనియర్ కళాశాలల క్రీడాకారులు హాజరయ్యారు. ముఖ్యఅతిథులుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ. క్రీడల కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు పొందవచ్చని తెలిపారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ. విజయమే లక్ష్యంగా క్రీడాకారులు ఆడాలని, రాష్ట్ర, జాతీయస్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. హనుమకొండకు చెందిన ఇరిగేసి అర్జున్ ప్రపంచ పోటీల్లో రాణిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.25 లక్షల నజరానా అందించారని గుర్తు చేశారు. అనంతరం కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈనెల 25, 26, 28, 29 తేదీల్లో క్రీడా పోటీలు ఉంటాయని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ అజీజ్ ఖాన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల ఇంటర్మీడియట్ అధికారులు గోపాల్‌రావు, శ్రీధర్, పీడీలు గోపీ, సతీష్, ప్రభాకర్, శ్యాంప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, లిల్లీఫ్లొరెన్స్, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.



తాగునీటి వృథా



రేగొండ మండలం రూపిరెడ్డిపల్లిలో తాగునీరు వృథాగా పోతోంది. గ్రామస్థులు పనుల కోసం బయటకు వెళ్లిన సమయంలో పంచాయతీ సిబ్బంది నీటిని సరఫరా చేస్తున్నారు. నల్లాలకు ఆన్ ఆఫ్‌లు లేకపోవడంతో ఇళ్ల ముందు ఉన్న సంపులు నిండిపోయి నీరు రహదారులపైకి చేరుతోంది. దీంతో రహదారులు బురదమయంగా మారుతున్నాయి. గ్రామస్థులు ఇళ్లలో ఉన్నప్పుడే తాగు నీటిని సరఫరా చేయాలని మహిళలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో రాంప్రసాద్‌ను వివరణ కోరగా ఇళ్లలోని నల్లాలకు ఆన్‌ఆఫ్‌లు లేకపోవటంతో నీరు బయటకు వస్తోందన్నారు. నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రేగొండ

పక్కాగా సామాజిక వర్గాల విశ్లేషణ సర్వే



సమావేశంలో పాల్గొన్న బీసీ అభివృద్ధి అధికారి శైలజ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ బీసీ కమిషన్ ఆదేశాల మేరకు అన్ని సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శైలజ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ కుల సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో శైలజ మాట్లాడారు. నవంబర్ 2న హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులతో రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ సమావేశమవుతారన్నారు. జిల్లాలోని అన్ని సామాజిక వర్గాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వంతెన కూలింది.. కాలినడకే దిక్కైంది!



ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు రాకపోకలు మెరుగుపర్చేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి- పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామాల మధ్యలోని మానేరు వాగుపై నిర్మిస్తున్న వంతెన పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిర్మాణ పనులు జరుగుతుండగానే ఈ ఏడాది ఏప్రిల్, జులైలో రెండుసార్లు వంతెన గడ్డర్లు కూలిపోయాయి. 2016లో రూ.51.60 కోట్లు మంజూరు కాగా.. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో గాలి దుమారానికి ఏప్రిల్‌లో 2-3 పియర్ల మధ్యలో మూడు గడ్డర్లు, జులైలో 17-18 పియర్ల మధ్యలో 5 గడ్డర్లు కూలిపోయి ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి పనులు నిలిచిపోయాయి. దీంతో రెండువైపులా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.. కూలీ పనులకు వెళ్లేవారు వాగు వరద ప్రవాహంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.. వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

–ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే టేకుమట్ల



వీరు పెద్దపల్లి జిల్లా ఓడేడు గ్రామానికి చెందిన కూలీలు. నిత్యం 500 మంది వరకు వాగులో నుంచి నడుచుకుంటూ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలానికి కూలీ పనులకు వస్తుంటారు. వాగు ప్రవహిస్తే ఇరువైపులా కాలినడక రాకపోకలు సైతం నిలిచిపోతాయి..

ఈ ప్రయాణం ప్రమాదం




పత్తి పంట దిగుబడులు వస్తుండటంతో వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది. హనుమకొండ జిల్లా పరకాల నుంచి నిత్యం వందలాది మంది మహిళా కూలీలు ట్రాక్టర్లు, ఆటోల్లో ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. వాహనాల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కించుకొని తీసుకెళ్తున్నారు. పరకాలలోని వెల్లంపల్లి రోడ్డులో గురువారం కొందరు మహిళలు ఇలా ఆటో వెనుక భాగంలో నిలబడి ప్రమాదకరంగా ప్రయాణించారు. ప్రమాదం జరగకముందే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. – న్యూస్‌టుడే, పరకాల

నేడు ముదిరాజ్ కుల వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్




నర్సంపేట, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లి పందిరి.నెట్ ముదిరాజ్ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని రెండు రోజులు నిర్వహిస్తోంది. నర్సంపేట కోర్టు హాలు వెనుక ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ వేదికగా ఈ కార్యక్రమం ఉంటుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు అక్టోబరు 26, 27 తేదీల్లో (శని, ఆదివారాల్లో) ఉదయం 9 సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవాలి. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్‌లో యాప్ ద్వారా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయాల్సిన వధూవరుల బయోడెటా, ఫొటోలు 83744 45190, 80080 02165 వాట్సాప్ నెంబర్లకు పంపించాలి. మరిన్ని వివరాలకు ఆ నంబర్లలో సంప్రదించాలి.



రాష్ట్ర సాంస్కృతిక రాజధానిగా పేరొందిన ఓరుగల్లుకు గర్వకారణంగా నిలిచే కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఇది ఉమ్మడి వరంగల్‌కే తలమానికంగా నిలవనుంది. పలుకుబడుల కవితలతో ప్రజాకవిగా.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి దాతగా పేరొందిన ఓరుగల్లు ముద్దుబిడ్డ కాళోజీ నారాయణరావు స్మారకార్థం హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో కళలకు నిలయంగా ఇది వెలుగొందనుంది.

– న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం



ఓరుగల్లుకు మణిహారం..

- మొత్తం విస్తీర్ణం 4.2 ఎకరాలు
- నిర్మాణం 4 అంతస్తులు
- మొత్తం భవన నిర్మాణం 6172 చదరపు అడుగులు
- ప్రహరీతో పాటు గార్డెన్, పార్కింగ్ కలిపి 95,548 చ.అ
- వ్యయం రూ.95 కోట్లు

కాళోజీ కళాక్షేత్రం

● అత్యాధునిక హంగులతో నిర్మాణం పూర్తి



ఆడిటోరియంలో సభావేదిక, పైన విద్యుద్దీపాలు

ప్రాంగణం ఆహ్లాదకరంగా.. కళాక్షేత్రం ఆవరణలో ఆహ్లాదకరమైన గార్డెన్‌తో పాటు పార్కింగ్ సదుపాయం ఉంది. ఇందులో రకరకాల పూలు, అలంకరణ మొక్కలు నాటారు. లోపలికి వెళ్లగానే పచ్చని మొక్కలు స్వాగతం పలుకుతాయి. ప్రవేశమార్గంలో కాళోజీనారాయణ రావు విగ్రహం దర్శనమిస్తుంది.



రవీంద్రభారతికి దీటుగా : హైదరాబాద్ రవీంద్ర భారతికి దీటుగా ఆడిటోరియం ఉంటుంది. రవీంద్రభారతి ఆడిటోరియం సీటింగ్ సామర్థ్యం 980. అదే కళాక్షేత్రంలో 1127 కుర్చీలు ఏర్పాటు చేశారు. ఇందులో అప్పర్ బాల్కనీలో 286 మంది కూర్చోవచ్చు. మిగతావి వరుస క్రమంలో కింద భాగంలో ఉంటాయి. సినిమా టాకీసును మించిన ఆధునిక సదుపాయాలు కల్పించారు. ఆడిటోరియం లోపలికి వెళ్లగానే కళ్లు విప్పారుతాయి. సభావేదికపై కెనరా లైటింగ్స్ ఆడియో, వీడియో సెట్టింగ్స్ చేశారు. స్టేజి వెనుక, ఇరువైపులా బాలురు, బాలికల కోసం 4 గ్రీన్ రూమ్స్, అతిథులు, నిర్వహణ కోసం 12 గదులు ఉన్నాయి. ఒకేసారి 500 మందికి పైగా వేదికపై కూర్చునేలా భారీ వేదిక నిర్మించారు. ప్రవేశ మార్గంలో ఇరు వైపులా సువిశాలమైన కారిడార్స్ నిర్మించారు. నిరంతర విద్యుత్తు సరఫరా కోసం ఆధునిక జనరేటర్ ఏర్పాటు చేశారు. ఆడిటోరియం లోపలికి వెళ్లడం, బయటకు రావడానికి రెండు వైపులా కలిపి ఆరు తలుపులు ఉన్నాయి.






కాళోజీ జ్ఞాపకాలతో ఆర్ట్ గ్యాలరీ


కాళోజీ నారాయణరావు తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొన్న చిత్రాలు, ఆయన సాధించిన పురస్కారాలతో ప్రత్యేకంగా ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. జిల్లాలోని కవులు, కళాకారులతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా పొందిన పురస్కారాలు, సరదాగా ముచ్చటించిన అరుదైన చిత్రాలను ఇక్కడ చూడొచ్చు.





గ్రంథాలయం ఏర్పాటు చేయాలి..

కాళోజీ నారాయణరావు 1930 నుంచి గ్రంథాలయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఉండాలనేది ఆయన ఆకాంక్ష. స్వరాష్ట్ర సాధన కోసం ఆయన అనేక పుస్తకాలు రచించారు. కవితలు, సూక్తులతో ప్రజలను చైతన్యపరిచారు. మరాఠీ, ఆంగ్లం, ఉర్దూ బాషల్లో పండితుడు. అనేక ఇతర భాషా గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. నా భారతదేశ యాత్ర, పార్థివ వ్యయం, కాళోజీ కథలు, నా గొడవ, జీవనగీత, తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, ఇదీ నా గొడవ, బాపూ! బాపూ! బాపూ! లాంటి అనేక కవితా సంపుటాలు రచించారు. ఆయన రచనలతో కళాక్షేత్రంలో ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేస్తే భావి తరాలు వాటి గొప్పతనం తెలుసుకునే అవకాశం ఉంది.





విద్యుత్తు తీగలకు.. ఊతమైన కర్ర

జనగామ మండలం మరిగడి గ్రామంలో పలు చోట్ల వ్యవసాయ బావుల వద్ద విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో యమపాశాల్లా వేలాడుతున్నాయి. ప్రస్తుతం వరి కోతల సీజన్ కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని రైతులు, వరి కోత యంత్రాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గానుగుపహాడ్-మరిగడి రహదారి పక్కన ఓ రైతు పొలంలో 11 కె.వి విద్యుత్తు తీగలు వేలాడుతుండగా, రైతు పైకి లేపేందుకు ఓ కర్రను ఏర్పాటు చేశారు ఇలా.. వర్షాలు కురిస్తే భూమికి ఎర్తింగ్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ విషయమై ఎన్పీడీసీఎల్ జనగామ రూరల్ ఏఈ మధును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వెంటనే మిడిల్ స్తంభాన్ని ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, జనగామ రూరల్

నిలిచిపోయిన గూడ్స్ రైలు

కేసముద్రం, న్యూస్‌టుడే: విజయవాడ - కాజీపేట మార్గంలో వెళ్తున్న ఓ గూడ్స్ రైలు ఓవర్‌హెడ్ ఎలక్ట్రిఫికేషన్ (ఓహెచ్‌ఈ)లో సాంకేతిక లోపం ఏర్పడి తాళ్లపూసపల్లి, కేసముద్రం రైల్వే స్టేషన్ల మధ్య 428 కి.మీ., వద్ద శుక్రవారం ఉదయం 8.15 గంటలకు నిలిచిపోయింది. రైల్వే అధికారులు మరో రైలు ఇంజిన్‌ను కేసముద్రం నుంచి తెప్పించి ఆగిన గూడ్స్‌కు అమర్చడంతో 9.20 గంటలకు కదిలింది. ఆ మార్గంలో వెళ్తున్న పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. మహబూబాబాద్‌లో కోర్బా ఎక్స్‌ప్రెస్, సింగరేణి, డోర్నకల్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లు సుమారు గంటపాటు నిలిచిపోయాయి.

ప్రజల అర్జీలు పరిశీలించిన మంత్రి సురేఖ



లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ ఓసిటీలోని తన క్యాంపు కార్యాలయానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం వచ్చారు. నగరంలోని పలు డివిజన్ల నుంచి నాయకులు, ప్రజలు తరలివచ్చి మంత్రికి విజ్ఞాపన పత్రాలు అందించారు. వరంగల్ వెంకట్రామా టాకీస్ సమీపంలోని శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించి భవనం కట్టి అద్దెకిచ్చారని మంత్రి దృష్టికి తెచ్చారు. కబ్జా అంశంపై వరంగల్ తహసీల్దారు ఎండీ ఇక్బాల్‌కు ఫోన్ చేసి మంత్రి ఫిర్యాదుకు సంబంధించిన అంశంపై తనకు పూర్తి వివరాలు కావాలని కోరారు. సమస్యల ఆధారంగా సంబంధిత అధికారులకు తగు ఆదేశాలిచ్చి అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేశారు.

హరిత పర్వతాలు.. పైన హిమాలయాలు...!





అక్కడి పరిసరాలన్నీ హరిత వర్ణంతో ముసుగేసినట్లు కనిపిస్తాయి. దేశ సరిహద్దుల్లో ఉన్న హిమాలయాలు లాగా హరిత కొండలు కనువిందు చేస్తాయి. ఆకాశం పైన ధవళ వర్ణంలో ఉన్న మేఘాలు మంచు కొండల్ని తలపిస్తున్నాయి. ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పరిధిలో విస్తరించిన ఇనుపరాతి గుట్టల ప్రకృతి రమణీయత కట్టిపడేస్తోంది. ఈత చెట్టును ఆవాసంగా మార్చుకుని ఉన్న గిజిగాని పక్షుల గూళ్లు ఆకాశంలో ఉన్న భ్రాంతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామ శివారులో తీసిన సుందర చిత్రాలు. – ఈనాడు, హనుమకొండ

చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)		
ఫాం: 115	డ్రెస్డ్: 199	
రిటైల్: 137	స్కిన్‌లెస్: 226	

కేఎంసీలో పరిశోధనోత్సవం ప్రారంభం



క్విజ్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు



అస్థిపంజరంతో ఫొటో..



సీపీఆర్‌తో ప్రాణాలు నిలపడం ఎలానో వివరిస్తూ..

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కాకతీయ వైద్య కళాశాల ఎన్ఆర్ఐ భవనంలో 'కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్' (కృతి) రెండో పరిశోధనా దినోత్సవ సదస్సు శుక్రవారం మొదలైంది. రాష్ట్రంలోనే మొదటి సారి అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతోపాటు పరిశోధనల వైపు మళ్లించడానికి నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రాష్ట్రం సహా, దేశం నలుమూలల నుంచి వచ్చిన వైద్యవిద్యార్థులు హాజరయ్యారు. కేఎంసీ యూఎస్ఏ అల్యూమిని, కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్ కన్వీనర్ డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి.బత్తిని అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్డీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్ క్విజ్) పోటీలు నిర్వహించారు. వైద్యపరిశోధనకు ఉపయోగపడేలా ఆటపాటలతో కూడిన క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఎన్ఆర్ఐ భవనం ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాళ్లలో జూనియర్ వైద్యవిద్యార్థులకు సీనియర్ విద్యార్థులు వైద్య అవగాహన కల్పించారు. ఇందులో శరీర నిర్మాణం, డయాలసిస్ ద్వారా కృత్రిమ రక్తశుద్ధి విధానం, గుండె పనితీరు. కార్డియాక్ అరెస్టు అయిన వ్యక్తిని పీసీఆర్ చేయడం ద్వారా ఎలా బతికించొచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య పరికరాలు, విజ్ఞానానికి సంబంధించి ఏర్పాటుచేసిన స్టాళ్లలో వైద్య పదజాలంతో కూడిన ఆటలు నిర్వహించారు.



వివిధ స్టాళ్ల వద్ద విద్యార్థులు

కేయూ ఈఈఈ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా సుమలత



ఉప కులపతి నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న సుమలత

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం నూతన పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా సహ ఆచార్యులు సుమలత నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత అధ్యక్షులు కె.చీనా నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించి, ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. సుమలతకు 14 ఏళ్ల బోధనానుభవం ఉంది. ఎన్ఎస్ఎస్ అధికారిగా, హాస్టల్ అదనపు సంచాలకులుగా, ఈఈఈ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహించారు. ఉప కులపతి ఆచార్య కె.ప్రతాపరెడ్డి నుంచి ఆమె నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

సైకిల్ సవారీ.. ఆరోగ్యమేమరి..



డిజిటల్ మీటర్



సైకిల్‌పై రయ్‌మంటూ వెళ్తున్న యువకుడు హనుమకొండలోని వికాస్‌నగర్‌కు చెందిన తోకల రాజురెడ్డి. తాను రోజూ భవన నిర్మాణ అవసరాల నిమిత్తం నగరంలో సైకిల్‌పైనే సుమారు 40 కిలోమీటర్లు తిరుగుతానని చెబుతున్నారు. దీనికి బ్యాటరీతో కూడిన మోటారు కూడా ఉండటంతో 15 కిలోమీటర్లు తొక్కుతూ.. మిగతాది బ్యాటరీ మోటారు ఆన్‌చేసి వెళ్తుంటానని తెలిపారు. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 50 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయొచ్చని చెప్పారు. సైకిల్‌కు ఏడు గేర్లు ఉంటాయని, హ్యాండిల్‌కు వేగాన్ని సూచించే డిజిటల్ మీటరు కూడా ఉంటుందన్నారు. ఇది వరకు తనకు బుల్లెట్ బండి ఉండేదని, దానికి ఇంధన ఖర్చు ఎక్కువ అవుతుండటంతో రెండు నెలల కిందట రూ.50 వేలు వెచ్చించి ఈ సైకిల్ కొన్నానని తెలిపారు. ప్రస్తుతం నెలకు సుమారు రూ.3 వేలకుపైగా ఆదా అవుతోందని, సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నానని ఉత్సాహంగా చెప్పారు. – ఈనాడు, హనుమకొండ



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఛైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపల్ రాజేష్‌కుమార్

ప్రతిభ చాటారు.. బహుమతులు సాధించారు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లిలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎన్.జోషిత్ (10 వ తరగతి), ఎం.హన్సిక (10వ తరగతి), ఎం.సహస్ర (9వ తరగతి)లకు పాఠశాల ఛైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపల్ రాజేష్ కుమార్ బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు కళల్లోనూ రాణించాలి

గణపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు కళలు, క్రీడల్లోనూ రాణించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోనాల రాజమౌళి అన్నారు. భూపాలపల్లిలో ఇటీవల జరిగిన కళా ఉత్సవం పోటీల్లో చిత్రలేఖనం విభాగంలో గణపురం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి జగదీశ్వర్, ఎస్‌జీఎఫ్ అండర్ 17 వాలీబాల్ పోటీల్లో షారుఖ్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. తెలంగాణ ఆల్ పెన్షనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు, పీఈటీ సరిత, డ్రాయింగ్ టీచర్ తంగళ్లపెల్లి వెంకటేశ్వర్లుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాజమౌళి మాట్లాడుతూ విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రేపాక రాజేందర్, డైరెక్టర్ కటుకూరి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ అశోక్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఛోటేమియా, హెచ్‌ఎంలు దేసు సతీశ్‌కుమార్, దూలం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల తీగల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన



మహాముత్తారం మండలం కొర్లకుంట ప్రధాన కూడలిలో విద్యుత్తు స్తంభాన్ని చెట్ల తీగలు అల్లుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. దీనిపై 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించారు. స్తంభాన్ని అల్లుకున్న చెట్ల తీగలను తొలగించారు. – న్యూస్‌టుడే, మహాముత్తారం

కేటీపీపీ సీఈతో భేటీ

చెల్పూర్, న్యూస్‌టుడే: కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీపీ) నూతన సీఈగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీప్రకాశ్‌ను శుక్రవారం భాజపా జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. పవర్ ప్లాంటు ద్వారా చేస్తున్న ఉత్పత్తి, ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు బీజేవైఎం కళాశాలల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేశ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు దుప్పటి భద్రయ్య, నాయకులు మాదాసు మొగిలి, భాస్కర్ రావు, నవీన్‌రావు, మొగిలి, వేణురావు,

కేంద్ర ప్రభుత్వ హామీలను అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

గణపురం, న్యూస్‌టుడే: కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. చెల్పూర్‌లో శుక్రవారం నిర్వహించిన సీపీఎం మహాసభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ప్రీతి జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ భాజపా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో గుర్రం దేవేందర్, చెన్నూరి రమేశ్, ఆకుల రవి, బ్రహ్మచారి, రమ, శ్రీదేవి, అనూష, సుశీల తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు పత్రాల విడుదల

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే: తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో శుక్రవారం భూపాలపల్లి ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు పాత్రికేయుల ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పాత్రికేయుల కల నెరవేరబోతోందన్నారు. యూనియన్లకు అతీతంగా ప్రతి పాత్రికేయుడికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీశ్‌కుమార్, కార్యదర్శి సామంతుల శ్యామ్, కుమార్‌యాదవ్, శ్రీనివాస్, సాంబయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సమావేశం వాయిదా

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం అభివృద్ధికి జిల్లా పాలనాధికారి రాహుల్‌శర్మ, కాళేశ్వరాలయం కార్యనిర్వహణాధికారి మారుతి, పర్యాటకశాఖ, వివిధ శాఖల అధికారులతో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించాల్సిన సమీక్ష సమావేశం వాయిదా పడింది. సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

కాటారం, న్యూస్‌టుడే: కాటారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బయ్యారంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ ఆరోగ్య సంస్థ వనరుల కేంద్రం(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) బృందం శుక్రవారం సందర్శించింది. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది, రోగులతో మాట్లాడి ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. గర్భిణులు, చిన్నారులకు, రక్తపోటు, మధుమేహం, క్షయ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలు, మందుల గురించి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ కన్సల్టెంట్ పీహెచ్‌పి కన్నన్, రాష్ట్ర ఎన్‌క్యూఎస్ పర్యవేక్షకురాలు విజయలక్ష్మి, ప్రోగ్రాం అధికారి శ్రీదేవి, చిరంజీవి, పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణపురం: నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ బృందం సభ్యులు కన్నా, విజయలక్ష్మిలు శుక్రవారం గణపురం పీహెచ్‌సీని సందర్శించారు.



కేంద్ర బృందంతో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, మందులను పరిశీలించారు. చెక్ లిస్ట్ ఆధారంగా పాయింట్స్ కేటాయిస్తామని, ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్స్ (ఐపీహెచ్‌ఎస్)కు ఆన్‌లైన్‌లో నివేదిక అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మధుసూదన్, ప్రోగ్రాం అధికారులు శ్రీదేవి, అనూష, భాష్యానాయక్, చిరంజీవి, మధు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కాటారం, న్యూస్‌టుడే: గంగారం శివారు మానేరు తీరం వద్ద శుక్రవారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మహిళ వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతురాలికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ శుక్రవారం తెలిపారు. ఇస్సిపేట వాగు వద్దకు పోలీసులు వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు రెండు ట్రాక్టర్లను వదిలేసి పారిపోయారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు.

జూదరుల అరెస్టు

రేగొండ, న్యూస్‌టుడే: రేగొండ మండలం లింగాలలోని ఓ ఇంటిలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు జూదరులను అరెస్టు చేసిన వారి వద్ద ఎస్సై ఎన్.సందీప్‌కుమార్ రూ.44,820 నగదు, ఐదు చరవాణులు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు బెల్టుల వితరణ



విద్యార్థులకు బెల్టులు అందిస్తున్న ఉపాధ్యాయులు

గణపురం, న్యూస్‌టుడే: గణపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయుడు బరిగెల సుదర్శన్ సమకూర్చిన టైలు, బెల్టులను ఎంఈవో ఉపలయ్య అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూలం కుమారస్వామి, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోనాల రాజమౌళి, ఉపాధ్యాయులు దేవేంద్ర, జలేందర్, శ్రీధర్, యంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి వడ్డీలేని రుణాలు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గోవిందరావుపేట మండలం చల్వాయిలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఆమె కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. సీఎస్‌ఆర్ నిధులు, మౌరిటెక్ ఐటీ సంస్థ సౌజన్యంతో 10 కంప్యూటర్లను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి అందజేశారు. అనంతరం చల్వాయి గ్రామంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉషా కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం వడ్డీ లేని రుణాలను అందజేస్తుందన్నారు. 17 రకాల వ్యాపారాలు చేసుకోవడానికి రుణాలు మంజూరు చేస్తుందని, అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సక్రమ లావాదేవీల ద్వారా రుణ పరిమితిని పెంచుకోవాల్సిన బాధ్యత గ్రూపు సభ్యులపైనే ఉందన్నారు. ములుగు జిల్లాకు వెనకబడిన జిల్లాగా పేరుందని, ఈతరం విద్యార్థులు బాగా చదువుకుని అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులకు మానసిక ఉత్సాహం, ఉల్లాసం, ధైర్యం, గౌరవించే మనస్తత్వం ఉండాలని, పేదల పట్ల ప్రేమ, కరుణ చూపించాలని సీతక్క పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి టీఎస్.దివాకర, అదనపు జిల్లా పాలనాధికారి సంపత్‌రావు, ఉషా కంపెనీ డిప్యూటీ మేనేజర్ రాజ్‌కుమార్, తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న విజయభాస్కర్

పలిమెల, న్యూస్‌టుడే: పలిమెల పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి విజయభాస్కర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించాలని కొత్త ఉపాధ్యాయులకు సూచించారు. సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలించారు. కంపోస్టు ఎరువులను మొక్కలకు వినియోగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం జీసీడీవో రమాదేవి, మండల విద్యాధికారి కేశవరావు తనిఖీ చేశారు. విద్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థినుల సామర్థ్యాలను అంచనా వేసి వారికి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని ప్రత్యేక అధికారిని పుష్పనీలకు సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నికపై సమావేశం

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే: జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నిక కోసం శుక్రవారం భూపాలపల్లిలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న కమిటీని రద్దు చేసి నవంబర్ 4న నూతన కమిటీ ఎన్నిక నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ప్రశాంత్‌రావు, రవీందర్, నర్సింగరావు, వినయ్‌కుమార్, రేపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

కొత్తపల్లిగోరి (రేగొండ), న్యూస్‌టుడే: రేగొండ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సంపత్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపల్లిగోరి ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా బట్టు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రమేశ్, శ్రీను, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వెంకన్న, కార్యదర్శిగా సదయ్య, ప్రచార కార్యదర్శి రాజేష్, సంయుక్త కార్యదర్శిగా చిరంజీవి, కోశాధికారిగా రాంబాబులను కార్యకర్తలు ఎన్నుకున్నారు. నాయకులు రమేశ్, రాజయ్య, సురేష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత యాదవ సంఘం ..

కాటారం, న్యూస్‌టుడే: అఖిలభారత యాదవ సంఘం మహాసభ రేగులగూడెం గ్రామ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవియాదవ్, గౌరవ అధ్యక్షుడిగా కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా శివ, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా సంపత్, కార్యవర్గ సభ్యులుగా మల్లయ్య, మల్లేష్, గట్టయ్య, రమేష్, పర్వతాలు, ప్రకాష్, రాజయ్యలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజయ్య, మండల అధ్యక్షుడు చంద్రయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27న ఖిలా వరంగల్ పడమర కోటలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన గోడ పత్రికలను శుక్రవారం భూపాలపల్లిలో ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి యుగేందర్ మాట్లాడుతూ.. బహిరంగసభలో కార్మికులు, విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

భూపాలపల్లి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు యాదవకాలనీ, కృష్ణాకాలనీలో సరఫరా అవుతున్న మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో తాగునీరు కలుషితమవుతోందని, దీంతో తాగునీటి సమస్య ఏర్పడిందని జై మహాభారత్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్పీకే.సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి, కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

బాలలను పనిలో పెట్టడం నేరం

ములుగు, న్యూస్‌టుడే: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పాన్ ఇండియా రిహాబిలిటేషన్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం ములుగులోని మెకానిక్ షెడ్లు, కార్ షెడ్లు, ట్రాక్టర్ షోరూంలు, గ్యాస్ ఏజెన్సీలలో బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. బాల కార్మికులను పనిలో చేర్పించుకోవడం నేరమన్నారు. దుకాణ యజమానులు నియమనిబంధనలు పాటించాలని సూచించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సభ్యులు బానోతు స్వామిదాస్, రాచర్ల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న శిబిరం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ యశోద ఠాకూర్

వెంకటాపూర్, న్యూస్‌టుడే: ఈనెల 15న రామప్పలో మొదలైన వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ల శిక్షణ శిబిరం శనివారంతో ముగియనుందని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కన్వీనర్, ప్రొఫెసర్ పాండురంగారావు అన్నారు. శిబిరంలో శుక్రవారం ఉదయం యోగా గురువు రాంబాబు వాలంటీర్లకు యోగాసనాలు వేయించారు. నృత్య రత్నావళిలోని నాట్యంపై ప్రొఫెసర్ యశోద ఠాగూర్ వివరించారు. ప్రొఫెసర్లు మల్లికార్జున రెడ్డి, రతీష్‌కుమార్ జియోమాఫిక్ స్ట్రక్చర్, హెరిటేజ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం రామప్ప సరస్సు కట్టపై ఉన్న త్రికూటాలయం వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించి ఆలయంపై మొలిచిన పిచ్చిమొక్కలను, చెత్తాచెదారం తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి కుసుమ సూర్యకిరణ్, పురావస్తు, పర్యాటకశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

'ఇన్‌స్పైర్' ఆవిష్కరణల్లో ఉమ్మడి వరంగల్‌కు మూడో స్థానం

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు కేంద్రం 'ఇన్‌స్పైర్' వేడుకలను నిర్వహిస్తోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఈ పోటీలను నిర్వహిస్తారు. ఇటీవల రాష్ట్ర స్థాయి ఆవిష్కరణలకు నామినేషన్లు ఆహ్వానించారు.. ఉమ్మడి వరంగల్ ఆవిష్కరణల సంఖ్యా పరంగా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. విద్యార్థులు తమ పరిసరాలు, స్థానిక అవసరాలు తదితరాలు పరిగణనలోకి తీసుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రూపొందించాల్సి ఉంటుంది. నిపుణులు పరిశీలించి ఉత్తమ ప్రాజెక్టులను జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారు. ఇలా ప్రాథమిక దశలో తయారుచేసే ప్రయోగాల ఖర్చుల కింద రూ.10 వేలు విద్యార్థి బ్యాంకు పొదుపు ఖాతాలో జమచేస్తుంది. గతంలో కంటే సృజనాత్మకత ఉన్న అంశాల ఆవిష్కరణలే విద్యార్థులు ప్రాథమికంగా తయారు చేశారని జనగామ జిల్లా విద్యాశాఖ సైన్సు అధికారి పాకనాటి రఘునందన్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా నుంచి అందిన నామినేషన్లు

జిల్లా	ప్రదర్శనల సంఖ్య
వరంగల్	1,592
హనుమకొండ	1,193
మహబూబాబాదు	1,074
జనగామ	754
భూపాలపల్లి	515
ములుగు	351

ఉత్తమ సేవా పత్రం అందజేత

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరంలోని హరిత హోటల్ మేనేజర్ జక్కం సురేష్ ఉత్తమ సేవ పత్రం అందుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న మేనేజర్

కుమురం భీంకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

మహాముత్తారం, న్యూస్‌టుడే: ఈనెల 27న కుమురంభీం వర్ధంతి సందర్భంగా శుక్రవారం మహాముత్తారం మండలం యామన్‌పల్లిలో కుమురంభీం విగ్రహానికి నాయక్‌పోడ్ సేవా సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుమురం భీం పోరాటం స్ఫూర్తిదాయకమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సేవా సంఘం మండల అధ్యక్షుడు వెంకటరాజం, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాంచందర్, టీపీసీసీ సభ్యుడు బెల్లంకొండ కిష్టయ్య, నాయకులు పిల్లి నాగయ్య, దేవరాజు, వెంకటేష్, బి.దేవరాజు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు అలివేణి-సుధాకరరావు అన్నారు. సెంటినరీకాలనీ సేవా భవన్‌లో టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్స్ తయారీ, బ్యూటీషియన్ తదితర విభాగాల్లో నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సేవా సభ్యురాలు విజయలక్ష్మి-వెంకటేశ్వర్లు, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, డీపీఎం గుర్రం శ్రీహరి, సీనియర్ పర్సనల్ అధికారి రాజేశం, సేవా కార్యదర్శి మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, సేవా సమితి సమన్వయకర్త రాయమల్లు పాల్గొన్నారు.

నివాస గృహాల్లో సమస్యల పరిష్కారానికి వినతి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: సెంటినరీకాలనీలోని సింగరేణి నివాస గృహాల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పన్నూరు మాజీ సర్పంచి అల్లం పద్మ శుక్రవారం ఆర్జీ-3 జీఎం సుధాకరరావుకు వినతిపత్రం అందజేశారు. క్వార్టర్లలో రెండు, మూడు రోజులకు ఒకసారి నీళ్లు వస్తుండగా 20 నిమిషాలను మించి రావడం లేదన్నారు. నిత్యం వచ్చేలా చూడాలని, మురుగుకాలువలు సక్రమంగా శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌టీటూ క్వార్టర్లకు రంగులు వేయాలన్నారు.

సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణకు డిమాండ్

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కార్మికులకు రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్(ఆర్‌సీఎఫ్) ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. శుక్రవారం ఆర్జీ-3 పరిధి ఓసీపీ-2లో నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్)లో జరిగిన కుంభకోణంపై సీబీఐతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రికార్డు స్థాయిలో బొగ్గు రవాణా

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఆర్జీ-1 ప్రాంతంలో గురువారం రికార్డు స్థాయిలో బొగ్గు రవాణా జరిగింది. ఒక్క రోజు 24,716 టన్నుల బొగ్గును రవాణా చేశారు. సాధారణంగా రోజు వారి లక్ష్యం 16,500 టన్నులు కాగా గురువారం రెట్టింపు స్థాయిలో రవాణా చేసి రికార్డు నమోదు చేశారు. రోజు వారి ఉత్పత్తి 14,000 టన్నులు కాగా నిల్వ బొగ్గుతో పాటు ఉత్పత్తయిన బొగ్గును వినియోగదారులకు రైలు, రోడ్డు మార్గాల ద్వారా సంస్థ రవాణా చేసింది. రికార్డు స్థాయిలో బొగ్గు రవాణా చేసేందుకు సహకరించిన ఉద్యోగులు, అధికారులను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అభినందించారు.

రీజియన్ స్థాయి సాంస్కృతిక పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం కాలనీలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో రామగుండం రీజియన్ స్థాయి సాంస్కృతిక పోటీలు జరిగాయి. కార్మికులు పాల్గొని సంగీత వాయిద్యాల్లో వారి ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. జానపద నృత్యం, పాటల పోటీల్లో పోటీ పడ్డారు. ప్రతిభ కనబర్చిన కళాకారులను సింగరేణి స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

బొగ్గుబాయి ముచ్చట్లు

మాజీ రెస్క్యూ సభ్యుల ఆ'పూర్వ' సమ్మేళనం

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సంస్థలో 2003-10 మధ్య కాలంలో విధులు నిర్వహించిన రెస్క్యూ సభ్యులు శుక్రవారం కాలనీలోని రెస్క్యూ స్టేషన్ ఆవరణలో కలుసుకున్నారు. ఉద్యోగ విరమణ పొంది వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన వారు అందరు ఏకమై ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గని కార్మికులుగా పనిచేస్తూనే రెస్క్యూ బ్రిగేడియర్ విభాగంలో పనిచేయడం వల్ల తాము ఇంకా ఆరోగ్యంగా ఉన్నామంటూ పేర్కొన్నారు. అనంతరం రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డిని, సూపరిండెంట్ మాధవరావును సన్మానించారు. జక్కిరెడ్డి, సత్యనారాయణ, రామకృష్ణ, సత్యనారాయణరెడ్డి, సత్తయ్య, దుర్గయ్య, నర్సింగరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు వేగం

గోదావరిఖని, న్యూస్‌టుడే: కార్మికవాడల్లో రహదారి వెడల్పు పనుల్లో భాగంగా ఖని ప్రధాన చౌరస్తా సమీపంలో ఉన్న నివాస గృహాన్ని తొలగించారు. చౌరస్తా నుంచి దుకాణాల సముదాయం వరకు మూడు నివాస గృహాలను తొలగించి రహదారిని విస్తరించాలని ప్రతిపాదనలు చేశారు. అందులో భాగంగా కార్మికులు నివాసం ఉంటున్న రోడ్డువైపు ఉన్న మూడు నివాస గృహాలను ఖాళీ చేయించేందుకు నోటీసులు జారీ చేశారు. దీంతో కొంత మంది కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఖాళీ చేసిన నివాస గృహాన్ని సిబ్బంది తొలగించారు.